
సాక్షి ఆదిలాబాద్

మంగళవారం | 15 | జూలై | 2025



రక్షణ చర్యలు కరువు..!
తాంసి మండలం వడ్డాడి గ్రామ సమీపంలో ఉన్న మత్తడివాగు ప్రాజెక్టు వద్ద రక్షణ చర్యలు కరువయ్యాయి. హెచ్చరిక బోర్డులు కానరావడం లేదు. 9లో▸



ఉద్యాన సాగుకు చేయూత
ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పూల మొక్కల సాగు, తోటలకు ప్రత్యేక రాయితీ అమలు చేస్తోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: గ్రూప్–1,2, 3,4తో పాటు బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సుల ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికా దాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలలోపు ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి ఆగస్టు 11 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ ఐదు నెలల పాటు ఉంటుందని పేర్కొన్నారు. డిగ్రీ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.1000 చొప్పున ఐదు నెలల పాటు స్టైఫండ్ అందించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 08732 221280 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం..
ఆదిలాబాద్‌టౌన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఈనెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. 2025 సంవత్సరానికి గాను అవార్డుల కోసం జిల్లాలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. nationalawardstoteachers. education. gov. in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని వివరించారు.

వేతనాలు పెంచాలని వినతి



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆదిలాబాద్: ఐటీడీఏ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైం, శానిటేషన్ వర్కర్ల వేతనాలు పెంచాలని ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను తెలంగాణ ప్రభుత్వ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంపీ నివాసంలో, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారిని కలిసి వినతిపత్రాలు అందించారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుస్సేన్, గౌరవ అధ్యక్షుడు కేబీసీ నారాయణ, నాయకులు రామచంద్ర, రాజలింగు, దిలీప్‌కుమార్ తదితరులున్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, సరెండర్, పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఇందులో సంఘం ప్రధాన కార్యదర్శి నర్సింహస్వామి, సంఘ బాధ్యులు లక్ష్మణ్, కిషన్, ప్రశాంత్, సులోచన రాణి, అరుణ పాల్గొన్నారు.

ప్లాట్ యజమానిని బెదిరించిన 8 మందిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్ యజమానిని బెదిరించి దౌర్జన్యంగా హద్దులు తొలగించిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. అందులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారంరాత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుడిహత్నూర్ మండలానికి చెందిన జాదవ్ రమేశ్ తన తల్లి సుందరాబాయి ఆదిలాబాద్ పట్టణంలోని నల్ల పద్మ వద్ద 2004లో సర్వే నంబర్ 68/బ/44/1 ప్లాట్ నంబర్ 91ను కొనుగోలు చేశారు. అప్పటి నుంచి వారు సమీపంలో నివాసం ఉంటున్నారు. పక్కా పత్రాలు ఉన్నప్పటికీ 2023 జనవరిలో సయ్యద్ హైమద్, ముజాహిద్ అలియాస్ పత్తి ముజ్జు, ఇస్మాయిల్ అలియాస్ తౌఫిక్, అతిక్, అబిద్, అదిల్, సర్ల బుచ్చన్న తదితరులు వర్కర్లతో కలిసి ప్లాట్‌లోకి చొచ్చుకెళ్లారు. ప్రహరీ ధ్వంసం చేశారు. బాధితులు అడ్డుకోవడంతో వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు లాక్కొని నకిలీ పత్రాలు చూపిస్తూ భూమి తమదేనని బెదిరింపులకు దిగారు. నెల తర్వాత వకులాభరణం ఆదినాథ్ ఇతరులతో కలిసి బాధితులను వినాయక్ చౌక్‌లోని ముజ్జు ఇంటికి పిలిపించారు. ప్లాట్‌కు కొంత డబ్బు ఇచ్చి తీసుకోండి లేదా మేమిచ్చిన డబ్బులు తీసుకుని ప్లాట్ వదిలేయండి.. లేదంటే మీ అంతు చూస్తామని మరోసారి బెదిరించారు. వీరి దౌర్జన్యానికి భయపడి వారు అప్పుడు ఫిర్యాదు చేయలేదు. ఇటీవల ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎనిమిది మందిపై కేసు నమోదైనట్లు తెలిపారు. అందులో పత్తి ముజ్జు, ఇస్మాయిల్, అబిద్, అదిల్, సర్ల బుచన్నను సోమవారం రాత్రి అరెస్టు చేసినట్లు తెలిపారు. సయ్యద్ హైమద్, ఆదినాథ్, అతిక్ అరెస్టు పెండింగ్‌లో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిదర్, ఎస్సై విష్ణువర్ధన్ ఉన్నారు.



జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానం పక్కనగల పల్లె ప్రకృతి వనం వద్ద, కైలాస్‌నగర్‌లోని భారత్ గ్యాస్‌కు వెళ్లే దారిలో ఇలా చెత్తా చెదారం పేరుకపోయింది. రోజుల తరబడి శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్రత వ్యాధులకు మూలమవుతుంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతున్నాయి.



జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతుంది. వైరల్, డెంగీ జ్వరాలతో పాటు వాంతులు, విరేచనాలతో ఎక్కువగా ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ఆయా వార్డులు కిక్కిరిసి దర్శనమిస్తున్నాయి.



- జిల్లాలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- కిక్కిరిసిపోతున్న ఆసుపత్రులు
- పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం
- అప్రమత్తమైన వైద్యశాఖ
- ఇంటింటా ర్యాపిడ్ ఫీవర్ సర్వే

జ్వరం.. దగ్గు.. తలనొప్పి

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో నీరు నిల్వ ఉండి దోమలు, ఈగలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో వైరల్ జ్వరాలతో పాటు టైఫాయిడ్, డెంగీ కేసులు నమోదవుతున్నాయి. దగ్గు, జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలతో జనం అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రస్తుతం రిమ్స్‌తో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. అప్రమతమైన వైద్యశాఖ ర్యాపిడ్ ఫీవర్ సర్వేతో పాటు ఎపడమిక్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. స్టాప్ డయేరియా కార్యక్రమం చేపడుతోంది. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

వ్యాధుల కాలం..
ఇటీవల కురిసిన వర్షాలతో ఆయా గ్రామాలు, పట్టణ ప్రాంతాలు చాలాచోట్ల అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. గుంతలు, మురుగుకాల్వలతో పాటు నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతున్నాయి. జిల్లాలో వారం పది రోజులుగా జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. చిన్నాపెద్ద తేడా లేకుండా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటికే 26 కేసులు నమోదు కాగా, ఈ నెలలోనే ఆరు నమోదు కావడం పరిస్థితికి అద్దం పడుతోంది.

వైద్యశాఖ అప్రమత్తం..

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య శాఖ కూడా అప్రమత్తమైంది. ముందస్తు ప్రణాళిక మేరకు చిన్నారులు డయేరియా బారిన పడకుండా 'స్టాప్ డయేరియా'ను జూన్ 16 నుంచి షురూ చేసింది. ఈనెల 31 వరకు కొనసాగించేలా నిర్వహిస్తోంది. అలాగే సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఓఆర్ఎస్, జింక్ మాత్రలతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వారానికి రెండుసార్లు ఐదేళ్లలోపు చిన్నారులకు ఐరన్‌సిరప్ అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 16 ఏళ్లలోపు వారికి వారానికోసారి ఐరన్ మాత్రలు అందిస్తున్నారు. ఇక ఆశలు, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. జ్వరం అదుపునకు అవసరమైన మందులు అందజేస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే.. ఫ్రైడే నిర్వహిస్తూ డెంగీ ప్రబలుతున్న కాలనీలు, గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఆదిమ గిరిజనులు నివసించే గ్రామాల్లో జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా 13 ప్రత్యేక వాహనాల ద్వారా వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే రెండు ఎపడమిక్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో హైరిస్క్ ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామని, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొంటున్నారు.



డెంగీ నివారణ కోసం నిల్వ ఉన్న నీటిలో టెనిఫాజ్ లిక్విడ్ వేస్తున్న ఆశ కార్యకర్త (ఫైల్)

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాం. గతేడాది జిల్లాలో 366 డెంగీ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 26 నమోదయ్యాయి. ఆశలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైన మందులను పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

డెంగీ నియంత్రణపై 'అర్బన్ యాక్షన్ ప్లాన్'
కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో డెంగీ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించిన వైద్యారోగ్యశాఖ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా అర్బన్ యాక్షన్ ప్లాన్ ఖరారు చేశారు. 49 వార్డుల పరిధిలో డెంగీ జ్వరాలను నియంత్రించేలా చేపట్టాల్సిన చర్యలపై ఆరు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. ఈమేరకు సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ సిబ్బందితో డీఎంహెచ్‌వో నరేందర్‌రాథోడ్, మెప్మా డీఎంసీ కె.శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. అర్బన్ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, వార్డు ప్రత్యేకాధికారులు, ఆర్‌పీలు, శానిటరీ సిబ్బందికి సూచనలు చేశారు. యాక్షన్ ప్లాన్‌ను మంగళవారం నుంచి అమలు చేయనున్నట్లుగా తెలిపారు. ప్రతీటీం వారంలో మూడుసార్లు మంగళ, గురు, శుక్రవారాల్లో తమకు కేటాయించిన వార్డుల్లో డ్రైడే, అంటీ లార్వా యాక్టివిటీస్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. శుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విన్నపాలు వినవలె



బాధితుల సమస్యలను ఆలకిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- ప్రజావాణికి అర్జీల వెల్లువ
- దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీదారులు కలెక్టర్ రాజర్షి షాకు మొర పెట్టుకున్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. తమ సమస్యలతో కూడిన దరఖాస్తులను కలెక్టర్‌కు అందజేశారు. వాటిని స్వీకరించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు అందజేస్తూ పెండింగ్‌లో ఉంచకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, ఆర్డీవో వినోద్‌కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వివిధ సమస్యలకు సంబంధించి ఈ వారం 131 దరఖాస్తులు అందాయి. అందులో కొందరి నివేదన..


సర్వేకు రావడం లేదు



నాకు బెల్లూరి శివారులో 49/3లో 8.18ఎకరాల వ్యవసాయ భూమి పట్టా ఉంది. అయితే క్షేత్రస్థాయిలో నాలుగెకరాల మాత్రమే ఉంది. మిగతా భూమి తమదంటూ ఇటీవల రైల్వే అధికారులు బండరాయిని పాతారు. అయితే ఆ భూమి హద్దులు చూపించాలని సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నాను. సర్వేయర్‌ను పలుమార్లు కలిసి విన్నవించినా రావడం లేదు. చొరవ చూపి న్యాయం చేయాలని కోరుతున్నా.

– చందా పొచ్చుబాయి, భీంసరి

కల్తీ కల్లు నిషేధించాలి



మా గ్రామంలో నిషేధిత పదార్థాలతో తెల్ల కల్లు తయారు చేసి అమ్ముతున్నారు. కల్తీ కల్లుకు బానిసై పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. కల్లు కంపౌండ్ ఆదిలాబాద్–కిన్వట్ అంతర్రాష్ట్ర రహదారిని ఆనుకునే ఉండటంతో ఈ మార్గం గుండా వెళ్లే వారు తాగుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. వెంటనే విక్రయాలు నిషేధించాలని కోరుతున్నాం.

– ఖోడద్ గ్రామస్తులు, తలమడుగు

బురదరోడ్డుతో తిప్పలైతంది..

మా గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఉన్న మట్టి రోడ్డు బురదమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అంబులెన్స్ వచ్చే పరిస్థితి కూడా లేదు. అనారోగ్యంతో ఉన్న ఓ పాపను ఇటీవల ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో మార్గమధ్యలోనే చనిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– గుబిడిపల్లి గ్రామస్తులు, భీంపూర్



వారిని మత్స్యకారులుగా గుర్తించొద్దు



గుండ్ల, బెస్త వారిగా పిలువబడే గంగపుత్రులు అనాదిగా చేపల వేటనే ప్రధాన వృత్తిగా జీవనోపాధి సాగిస్తున్నారు. అనేక కుల వృత్తులు కలిగిన ముత్రాసి, ముదిరాజ్, తెనుగు కులస్తులను రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులుగా గుర్తించేందుకు యత్నిస్తుంది. ఇదే జరిగితే గంగపుత్రులకు అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వం వెంటనే ఆ నిర్ణయం ఉపసంహరించుకోవాలని కోరుతున్నాం.

– గంగపుత్ర సంఘ బాధ్యులు, ఆదిలాబాద్

గప్‌చుప్‌గా..!

- కొత్త ఎంప్యానల్‌మెంట్ జాబితా విడుదల
- ఉపాధి కల్పన శాఖాధికారి కార్యాలయ గోడపై ప్రదర్శన

సాక్షి, ఆదిలాబాద్: ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల కొత్త ఎంప్యానల్‌మెంట్‌కు సంబంధించి జాబితాను సోమవారం గోప్యంగా విడుదల చేశారు. సంబంధిత పేపర్లను ఆ ఆఫీస్ గోడలపై అతికించారు. అందులో కొన్ని ఏజెన్సీలు ఎలిజిబుల్ అయ్యాయని, మిగతావి నాన్ ఎలిజిబుల్‌గా ప్రకటించారు.అయితే ఆయా ఏజెన్సీ నిర్వాహకులకు కనీసం సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఈజాబితాకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదుచేయాలని అందులో పేర్కొన్నారు. ఆ తర్వాత ఎలాంటి ఫిర్యాదు చేసినా చెల్లదని స్పష్టం చేశారు. కనీసం ఇది విడుదల చేసినట్టు మీడియా పరంగా ప్రకటన జారీ చేశారా అంటే.. అదికూడా లేదు. అలాంటప్పుడు ఏజెన్సీ నిర్వాహకులకు ఆ జాబితాపై ఎలా తెలిసేది.. వారు ఫిర్యాదు చేసేదెలా. ఈ జాబితాలో శ్రీ మహాలక్ష్మి మ్యాన్ పవర్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీసెస్ అనే ఏజెన్సీకి సంబంధించి నోడ్యూ సర్టిఫికెట్ వంద పోస్టులకు సంబంధించి జత చేసినట్టు వివరాల్లో పేర్కొంటూ ఆ ఏజెన్సీ ఎలిజిబుల్ అయినట్టు జాబితాలో ప్రకటించారు. అయితే ఈ ఏజెన్సీ రిమ్స్‌లోనే సుమారు 400 పోస్టులు ప్రస్తుతం నిర్వహిస్తుంది. అలాంటప్పుడు కేవలం వంద పోస్టులకు సంబంధించి నోడ్యూ జత చేసినట్టు జాబితాలో ఎలా పేర్కొంటారని పలువురు ఏజెన్సీ నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. మిగతా పోస్టుల్లో డ్యూ ఉంటే ఎలా అని అంటున్నారు. ఈ ఏజెన్సీ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పలువురు ఉద్యోగుల ఈపీఎఫ్ ఎగ్గొట్టిందని ఆరోపిస్తున్నారు.

కొత్త ఎంప్యానల్‌మెంట్‌లో 32 ఏజెన్సీలకు సంబంధించి జాబితాలో వివరాలు వెల్లడించారు. గడువులోపు అభ్యంతరాలు తెలియజేయాలని అందులో స్పష్టం చేశారు. నాన్ ఎలిజిబుల్‌గా ప్రకటించిన ఏజెన్సీలు ఎక్కడ లోపాలు ఉన్నాయో తెలుసుకొని ఆ పత్రాలు అధికారికి అందజేసే అవకాశం ఉంటుందని,తద్వారా ఏజెన్సీ అర్హత సాధిస్తుందని అంటున్నారు. అయితే ఈ జాబితా విడుదల చేసినట్టు కనీసం తెలియజేయకపోవడం, గడువురెండు రోజులు మాత్రమే ఉండడంతో ఆ లోపాలు మాకు ఎలా తెలుస్తాయని వారు వాపోతున్నారు. అదే సమయంలో ఎలిజిబుల్ అయిన ఏజెన్సీల లోపాలపై ఫిర్యాదుకు ఎలా ఆస్కారం ఉంటుందని ప్రశ్నిస్తున్నారు.



NOTICE FOR INVITING OBJECTIONS ON OUTSOURCING TENDERS

This is inform that all concerned outsourcing Agencies that the tender received in response to the invitation for EMPANELMENT OF OUTSOURCING AGENCIES IN ADILABAD DISTRICT have been opened and evaluated by the Outsourcing Committee.

All objections must:

- Be submitted in writing and self-attested
- Clearly specify the grounds for objection

Please address objections to:

District Employment Officer,
O/o. District Employment Exchange,
Adilabad – 504001

DISTRICT EMPLOYMENT OFFICER,
DEE, ADILABAD

ఉపాధి కల్పన శాఖాధికారి కార్యాలయ గోడపై ప్రదర్శించిన జాబితా

కమిటీ తీరుపై ఆది నుంచి విమర్శలే..
జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల గుర్తింపునకు సంబంధించి కొత్త ఎంప్యానల్‌మెంట్ ఏర్పాటులో ఆది నుంచి కమిటీ నిర్వహిస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా ఈ ప్రక్రియ ఓ అధికారి తాను అనుకున్నట్టుగా సాగిస్తున్నారనే ప్రచారం సాగుతుంది. కొన్ని ఏజెన్సీలకు అనువుగా ఈ కమిటీలోని ఓ అధికారి వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో ఉపాధికల్పన శాఖ ఇన్‌చార్జి అధికారి మిల్కాను వివరాలు కోరేందుకు పలుమార్లు ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



ధర్నా చేస్తున్న గెస్ట్ లెక్చరర్లు

కైలాస్‌నగర్: తమ సమస్యల పరిష్కారం కోసం గెస్ట్ లెక్చరర్లు, అంగన్‌వాడీలు సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నాలు నిర్వహించారు.

బీఎల్‌వో విధులు మినహాయించాలని అంగన్‌వాడీలు..
స్థానిక సుందరయ్య భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చిన అంగన్‌వాడీలు ప్రధాన ద్వారం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ.. చిన్నారులకు పోషకాహారం అందించడం, కేంద్రం నిర్వహణ, న్యూట్రిషియన్ హెల్త్ చెకప్‌లు, సమాచారం అందించడం వంటి ఐసీడీఎస్‌కు సంబంధించిన అనేక పనులు నిర్వహిస్తున్నారన్నారు. వారిపై మరింత భారం మోపేలా బీఎల్‌వో విధులు అప్పగించడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే దానిని మినహాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు వెంకటమ్మ, సునీత, విజయ, లక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రెన్యూవల్ చేయాలని గెస్ట్ లెక్చరర్లు..
తమను రెన్యూవల్ చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోగాల ప్రవీణ్ మాట్లాడారు. డిగ్రీ కళాశాలలు ప్రారంభమై 40 రోజులైనా గెస్ట్ లెక్చరర్లను ప్రభుత్వం రెన్యూవల్ చేయకుండా కాలయాపన చేస్తుండడంతో అధ్యాపకులు, విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం రూ.50వేల కనీస వేతనాన్ని 12నెలలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, బి.రాహుల్, ఉపాధ్యక్షులు సుభాష్, కోశాధికారి ఆనంద్, నారాయణ, సంజీవ్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి రండి..

- కలెక్టర్‌ను ఆహ్వానించిన ఇందిరమ్మ లబ్ధిదారు

కైలాస్‌నగర్: బజార్‌హత్నూర్ మండలానికి చెందిన ఇందిరమ్మ లబ్ధిదారు ఉయికే సుభద్రబాయి సోమవారం కలెక్టర్ రాజర్షి షాను గ్రీవెన్స్‌లో కలిశారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. కాగా గతేడాది ఆగస్టు 7న బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో పర్యటించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దివ్యాంగురాలైన సుభద్రబాయి పరిస్థితి తెలుసుకుని ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేశారు. జిల్లాలోని తొలి లబ్ధిదారు ఆమెనే. రూ.5లక్షలతో చేపట్టిన ఇంటి నిర్మాణం ఇటీవల పూర్తయింది. ఈ క్రమంలో సోమవారం కలెక్టర్‌ను కలిసి గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆహ్వానించారు. స్పందించిన ఆయన తాను హాజరయ్యే తేదీ సమాచారం త్వరలోనే చెబుతానని తెలిపారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సుభద్రబాయి

దరఖాస్తుల విచారణ వేగవంతం చేయండి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్

కైలాస్‌నగర్: రేషన్‌కార్డు దరఖాస్తుల విచారణ వేగవంతం చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో పలు అంశాలపై సమీక్షించి సూచనలు చేశారు. ఆర్ఐలు, తహసీల్దార్లు తమ లాగిన్లలో ఉన్న అప్లికేషన్లను త్వరితగతిన పరిశీలించి డీసీఎస్‌వోకు పంపించాలన్నారు. డీసీఎస్‌వో కార్యాలయంలో సిబ్బంది పనివేళలు కొంత పెంచి దరఖాస్తులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేకాధికారులు నెలలో రెండు రోజులు విధిగా కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లను సందర్శించాలన్నారు. రోజూ వారి మెనూ అమలు, భోజనం నాణ్యత పరిశీలించాలన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమాల అమలు తీరుపై ఆరా తీయాలన్నారు. ప్రభుత్వ శాఖల పనులకు అవసరమైన ఇసుకకు సంబంధించి ప్రతిపాదనలు మంగళవారం సాయంత్రంలోగా ఇంజినీరింగ్, ఆయా శాఖల అధికారులు మైనింగ్ శాఖ అధికారికి అందజేయాలని ఆదేశించారు. సీఎం ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉంచకూడదన్నారు. అనంతరం పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, ఆర్డీవో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. సోమవారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో పొలంబాట రోడ్లు, గర్ల్స్ టాయిలెట్లు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతనంగా మంజూరైన పనులు వెంటనే ప్రారంభించడంతో పాటు, పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా శ్రద్ధ వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. 630 కిలోమీటర్ల వరకు చేపట్టనున్న 512 పొలంబాట రోడ్లకు రూ.34 కోట్లు, 118 బాలికల మరుగుదొడ్లకు రూ.2.36 కోట్లు, 99 గ్రామపంచాయతీ భవనాలకు రూ.2.36 కోట్లు, 40 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు రూ.4.80 కోట్ల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ శివరాం రాథోడ్, పీఆర్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్‌కు తీవ్రగాయాలు

భీమారం: మండలంలోని పోలంపల్లి సమీపంలోని మాంతమ్మ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుంకరిపల్లికి చెందిన ఫొటోగ్రాఫర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కోట మహేందర్ నస్పూర్‌లోని ఓ ఫంక్షన్‌లో ఫొటోలు తీసి బైక్‌పై భీమారంవైపు వస్తుండగా చెన్నూర్ నుంచి మంచిర్యాలవైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో 108లో మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నర్సాపూర్ శివారులో..

నర్సాపూర్(జి): నర్సాపూర్(జి)గ్రామ శివారులో ఆగి ఉన్న బైకును కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల మేరకు.. కుభీర్ మండలంలోని మాలేగాం గ్రామానికి చెందిన అన్నదమ్ములు ధనోరే దేవానంద్, ధనోరే మాధవ్ బైక్ పై నిర్మల్‌కు వెళ్లి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో నర్సాపూర్ (జి)గ్రామ శివారులో రోడ్డు పక్కన బైక్‌ను నిలిపి ఉంచి నిలబడ్డారు. నిర్మల్ నుంచి భైంసా వైపు వెళ్తున్న ముధోల్ గ్రామానికి చెందిన పెద్ద కరోల్ల యోగేష్ కారును అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డు పక్కన నిలబడిన దేవానంద్‌తో పాటు బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో దేవానంద్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


సంపత్ (ఫైల్)

కోటపల్లి: మండల కేంద్రానికి చెందిన బోమ్మన సంపత్ (30)ఈనెల 11 రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య స్వప్న, సోదరుడు రమేశ్ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్ వివరించారు.

కారు డివైడర్‌ను ఢీకొని సింగరేణి కార్మికుడు..


సంతోష్ (ఫైల్)

శ్రీరాంపూర్: సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీసీసీ ఆర్కే 5 కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జీ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తగరం సంతోష్ (37) అనే సింగరేణి కార్మికుడు మృతి చెందగా మరో కార్మికుడు మహేశ్వర్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్కే 5 గనికి చెందిన జనరల్ అసిస్టెంట్ తగరం సంతోశ్, సపోర్టుమెన్‌గా పని చేస్తున్న మహేశ్వర్ రెడ్డి కారులో పనిమీద బయటకు వెళ్లి నాగార్జున కాలనీలో ఉన్న ఇంటికి వస్తుండగా రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద డివైడర్‌ను ఢీకొన్నారు. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సంతోష్ మృతి చెందాడు. మృతునికి భార్య రవీణా, పిల్లలు హన్సిత్, త్రిశూల్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

ఐఎన్టీయూసీ నేతల పరామర్శ

ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, ఇతర నాయకులు ఏరియా ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహేశ్వర్‌రెడ్డికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరిగే స్వామి, పిన్నింటి మల్లారెడ్డి, మహేందర్‌రెడ్డి, చందు మోహన్, నంబయ్య, జగదీశ్, పాల్గొన్నారు.

స్తంభం పైనుంచి జారి పడి ఒకరు మృతి


సంఘటన స్థలంలో లస్మన్న మృతదేహం

బేల: మండలంలోని సిర్సన్న గ్రామంలో సోమవారం సాయంత్రం విద్యుత్ స్తంభంపై వీధి దీపాలు పెడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి గోదురి లస్మన్న (42) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ప్రైవేటు లైన్‌మెన్ గోదురు లస్మన్న గ్రామంలోని ఓ కూడలిలో విద్యుత్ స్తంభంపై ఎక్కి వీధి దీపాలు పెడుతుండగా ప్రమాదవశాత్తు జారి సీసీ రోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై మధుకృష్ణ, సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఉద్యాన సాగుకు చేయూత

- పండ్లు, పూలతోటల పునరుద్ధరణకు చర్యలు
- సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందజేత
- లాభదాయకమైన పంటల సాగుకు ముందుకు రావాలని సూచన


అర్చన, ఉద్యానవన అధికారి, బెల్లంపల్లి


పందిరిసాగు ద్వారా సాగు చేసిన కూరగాయలు

బెల్లంపల్లి: ఉద్యానవన పంటల సాగుకు ఊతం ఇవ్వడానికి ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. ఫలసాయాన్నిచ్చే మొక్కల పెంపకానికి, కూరగాయలు, పూలమొక్కల సాగుకు, తోటల పునరుద్ధరణకు బిందు, తుంపరసేద్యం పరికరాలు అందించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, సామాజిక వర్గాలకు చెందిన రైతులకు ప్రత్యేక రాయితీలను అమలు చేస్తోంది. ఔత్సాహిక రైతులు రాయితీ సదుపాయం సద్వినియోగం చేసుకుని లాభదాయకమైన పంటలను పండించడానికి ముందుకు రావాలని బెల్లంపల్లి ఉద్యానవన శాఖ అధికారి అర్చన కోరారు. ఉద్యాన శాఖ పథకాలు, ప్రభుత్వం కల్పించిన రాయితీ వివరాలను వెల్లడించారు.

సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం

ఈ పథకం కింద కొత్తగా తోటల పెంపకానికి ఔత్సాహిక రైతులకు ప్రభుత్వం తగిన చేయూతను అందిస్తోంది. మామిడి, నిమ్మ, జామతోటల పెంపకానికి ఎకరాకు రూ.19,200, బొప్పాయి సాగుకు రూ.7,200, డ్రాగన్ సాగుకు రూ.64,800, అరటి తోటకు రూ.16,800, పూలతోటకు రూ.8 వేలు, వయస్సు పైబడిన (20 నుంచి 30 సంవత్సరాలు) మామిడితోటల పునరుద్ధరణకు ఎకరాకు రూ.9,600, మల్చింగ్ కవర్ ఏర్పాటు చేసుకోవడానికి ఎకరాకు రూ.8వేల చొప్పున అందిస్తోంది.

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన

ఈ పథకం రైతాంగానికి తగిన తోడ్పాటును అందిస్తుంది. పథకం ద్వారా అర ఎకరం విస్తీర్ణంలో శాశ్వత పందిరి నిర్మాణానికి రూ.50 వేలు ప్రభుత్వం అందిస్తుంది. ప్రస్తుత రోజుల్లో శాశ్వత పందిరిని ఏర్పాటు చేసుకుని కూరగాయలను సాగు చేయడం వల్ల పంట దిగుబడి పెరగడంతో పాటు అధిక లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

బిందు, తుంపర సేద్యం పథకం

ఉద్యానవన పంటల సాగులో బిందు, తుంపర సేద్యానికి ఎంతగానో ప్రాధాన్యత ఉంది. నీటిని పొదుపుగా వాడుకుని, మొక్కకు సరిపడా నీటిని, మోతాదుకు సరిపడా ఎరువులను బిందు, తుంపర సేద్యం ద్వారా అందించడం తేలికవుతుంది. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీతో పరికరాలు అందించనున్నారు. బీసీ రైతులకు 90 శాతం, ఓసీ రైతులకు ఐదెకరాల వరకు 90 శాతం రాయితీని, తుంపర సేద్యం పరికరాలకు 75 శాతం రాయితీని ప్రభుత్వం వర్తింప జేసింది.

జాతీయ వెదురు పథకం

వెదురు సాగు చేయడానికి కూడా ప్రభుత్వం ప్రత్యేక రాయితీని కల్పించింది. జాతీయ వెదురు పథకం కింద రూ.24 వేలు అందించి 50 శాతం రాయితీని కల్పించింది. సాగుకు యోగ్యంకాని భూముల్లో వెదురు సాగు చేయడం వల్ల కొన్నాళ్లకు వెదురు చేతికందివ లాభదాయకంగా ఉంటుంది.

రైతులు అందించాల్సిన పత్రాలు

ఆయా పథకాల ద్వారా ప్రభుత్వం నుంచి రాయితీ పొందడానికి రైతులు తగిన పత్రాలు అందజేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా రైతుకు సంబంధించిన భూమి పట్టేదారు పాసు పుస్తకం, బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అందజేయాలి. గరిష్ఠంగా ఐదెకరాల భూమి కలిగిన రైతులు ప్రభుత్వ రాయితీ పొందడానికి అర్హులు. ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి తుది గడువు లేదు. సంబంధిత ప్రాంతాల ఉద్యానవన శాఖ అధికారులకు పత్రాలు అందజేయాల్సి ఉంటుంది.

ఫెయిల్యూర్ సక్సెస్‌కు అడ్డు కాదు



సమావేశంలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, అధికారులు

- వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్
- విద్యార్థులతో ముఖాముఖి


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బాసర: ఫెయిల్యూర్ అనేది సక్సెస్‌కు అడ్డుకాదని ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. సోమవారం ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్‌తో కలిసి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ కంఫర్ట్ జోన్ , ఫియర్ జోన్, లెర్నింగ్ జోన్, గ్రోత్ జోన్ అనే జీవన దశలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్జీయూకేటీ ఒక «లెర్నింగ్ జోన్» అని విద్యార్థుల అభ్యాసానికి, అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలుస్తుందన్నారు. అపజయాలను మార్గదర్శకంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. విజయం సాధించాలంటే నిరంతర కృషి, స్థిరత్వం, ఆత్మవిశ్వాసం ముఖ్యమన్నారు. సగటు విద్యార్థులు కూడా అసాధారణ విజయాలు సాధించగలరన్నారు. ముఖ్యంగా ధైర్యం, దృఢ సంకల్పంతో ఎదగాలన్నారు. నిజమైన విజయం బయట నుంచి రాదని, అది మన లోపల నుంచే మొదలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు డాక్టర్ విట్టల్, డాక్టర్ నాగరాజు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు హెల్ప్‌లైన్

ఆదిలాబాద్: ఆర్టీసీ ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రజా రవాణా సంస్థ మరో ముందడుగు వేసింది. ప్రయాణికులు తీసుకునే టికెట్‌పై హెల్ప్‌లైన్ నంబర్ ముద్రించింది. ప్రయాణికులు ఈ నంబర్‌లో సంప్రదించి సమస్యలు పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించింది. బస్సులో చిల్లర సమస్య కారణంగా కండక్టర్ ప్రయాణికుడి టికెట్ వెనుక డబ్బులను రాసి ఇస్తుంటారు. అయితే హడావుడిలో కండక్టర్ లేదా ప్రయాణికుడు మర్చిపోతే ఆ డబ్బులను ప్యాసింజర్ నష్టపోవాల్సి వచ్చేది. అయితే ఈ సమస్యను దూరం చేయాలనే ఉద్దేశంతో హెల్ప్ లైన్ నంబర్ 040-69440000ను ఆర్టీసీ యాజమాన్యం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎవరైనా ప్రయాణికుడు తొందరపాటులో ఆ డబ్బులను తీసుకోకుండా దిగిపోతే టికెట్‌పై ముద్రించిన హెల్ప్‌లైన్ నంబర్‌లో సంప్రదించి వివరాలు వెల్లడిస్తే, ఫోన్ పే వంటి యూపీఐ సేవల ద్వారా ఆ డబ్బును యాజమాన్యం తిరిగి చెల్లించనుంది. అంతేకాకుండా ప్రయాణికులు తమ విలువైన వస్తువులను బస్సుల్లోనే మర్చిపోతే, ఈ సహాయవాణి సేవలను పొంది వారి వస్తువులను తిరిగి పొందవచ్చు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు మధ్యలో ఏదైనా హాల్టింగ్ స్టేషన్ వచ్చినప్పుడు దిగి ఎక్కేలోపు బస్సు వెళ్లిపోయిన సమయంలో ద్వారా ఆర్టీసీ సిబ్బందిని సంప్రదిస్తే అదే రూట్‌లో ఆ తర్వాత వచ్చే బస్సులో అదే టికెట్‌పై ప్రయాణించేలా అధికారులు ఏర్పాట్లు చేయడం విశేషం. ఈ విధంగా ఒకే హెల్ప్‌లైన్ నంబర్‌పై ఇన్ని సేవలు అందించడంపై ప్రయాణికుల నుంచి సైతం అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఉరేసుకుని ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య!

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన


ఆయు (ఫైల్)


మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: మండలంలోని సమాక గ్రామ పంచాయతీ పరిధిలోని రాముగూడ అటవీప్రాంతంలో ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు రాముగూడలో కొలాం గిరిజన తెగకు చెందిన టికం బాపురావ్, చిన్నిబాయి దంపతులకు లక్ష్మీబాయి, రాజు, జంగు, టికం ఆయు(30) అలియాస్ అరుణ సంతానం. ఐదేళ్లక్రితం తల్లిదండ్రులు మృతి చెందగా ఆయు(అరుణ) ట్రాన్స్‌జెండర్‌గా వేషం మార్చి గుడిహత్నూర్ మండలంలోని అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ నెల 8న ఇచ్చోడకు చెందిన స్నేహితుడు జాదవ్ అర్జున్‌తో కలిసి రాముగూడకు వచ్చాడు. పంటచేను వద్దకు వెళ్లి సాయంత్రం వరకు అక్కడే ఉన్నారు. అనంతరం ఆయు కనిపించకుండా పోయాడు. 9న సాయంత్రం జాదవ్ అర్జున్ రాముగూడకు వచ్చి ఆయు చేనులో ఉరేసుకున్నాడని కుటుంబ సభ్యులకు చెప్పాడు. పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే 10న మృతదేహానికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న తోటి ట్రాన్స్‌జెండర్లు జాదవ్ అర్జున్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఈ నెల 13న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ సోమవారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి పంచనామా నిర్వహించారు. గ్రామ పటేల్ టేకం రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జనావాసాల్లోకి చుక్కల దుప్పి


చుక్కల దుప్పి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామ పంచాయతీలోని కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ పరిధిలో గల గాంధారీ ఖిల్లా సఫారీలో తిరుగాడుతున్న చుక్కల దుప్పి సోమవారం దారితప్పి బెటాలియన్ పరిసరాల్లోని నివాస గృహాల్లోకి వచ్చింది. గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో అటవీ ప్రాంతంలోకి పంపించారు.

యువకుడిపై కత్తితో దాడి

- ముగ్గురిపై హత్యాయత్నం కేసు


అరెస్టు చూపుతున్న ఎస్సై

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొమ్మ సంతోష్‌పై అదే గ్రామానికి చెందిన దుర్గం వెంకటేష్ ఆదివారం రాత్రి కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇద్దరికి ట్రాక్టర్ల విషయంలో గతంలో పలుమార్లు గొడవలు జరిగాయి. పాత కక్షలను మనసులో పెట్టుకున్న వెంకటేష్ సంతోష్‌ను ఇంటికి పిలిపించి తండ్రి రాయపోశం, తల్లి శారదతో కలిసి దాడికి పాల్పడ్డారు. బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేష్, అతని తల్లిదండ్రులను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

కుమారుడిని కిడ్నాప్ చేసిన తండ్రిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మహ్మద్ ఆసిమ్–సుమేర దంపతులు గొడవలతో కొంత కాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. ఆసిమ్ రెండో భార్యతో ఉంటున్నాడు. సోమవారం సుమేర వద్దకు వచ్చి తాను ఇక నుంచి నీతోనే ఉంటానని చెప్పాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో ఇంటి బయట ఆడుకుంటున్న ఆయన మూడేళ్ల కుమారుడు ఎండీ ఉమర్‌ను కిడ్నాప్ చేసినట్లు సుమేర చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు వివరించారు.

దస్తురాబాద్‌లో చోరీ

దస్తురాబాద్: మండల కేంద్రానికి చెందిన బోమ్మడి సంగీత ఓ అద్దె ఇంట్లో ఉంటుంది. ఆమె భర్త పోషమల్లు విదేశాలకు వెళ్లటంతో రాత్రి సమయంలో తల్లి బింగి రాజవ్వ ఇంట్లో పడుకుంటోంది. ఇదే అదునుగా భావించిన దొంగ ఆదివారం రాత్రి ఇంట్లో దూరి గ్యాస్ సిలిండర్లు, ల్యాప్‌టాప్, ఇంటి సామగ్రి దొంగిలించాడు. బాధితురాలు ఉదయం ఇంటికి వెళ్లి చూసేసరికి తాళం పగులకొట్టి ఉండడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు గ్రామానికి చెందిన మోతే రాజేందర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం అంగీకరించడంతో సామగ్రి రికవరీ చేశారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గంటల వ్యవధిలో నిందితుడిని పట్టుకున్న కానిస్టేబుళ్లు షఫీఉద్దీన్, సమంత్‌రెడ్డిలను ఎస్సై సాయికుమార్ అభినందించారు.

హాస్టల్ ఇష్టం లేక విద్యార్థిని ఆత్మహత్యాయత్నం


శ్రీరాంపూర్: సీసీసీలోని కస్తూరిబా బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని సోమవారం బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన చోటు చేసుకుంది. ఉదయం హాస్టల్ బిల్డింగ్‌పై నుంచి కిందకు దూకడంతో గమనించిన విద్యార్థులు వెంటనే పాఠశాల ప్రిన్సిపాల్ మౌనికకు సమాచారం అందించగా వెంటనే మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. విద్యార్థిని రెండు కాళ్లకు స్వల్పగాయాలయ్యాయని, ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. పథకం ప్రకారం చనిపోవాలనే ఉద్దేశంతో విద్యార్థిని ముందుగా లేఖ రాసి బిల్డింగ్‌పై నుంచి దూకిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఎనిమిదో తరగతి వరకు హాజీపూర్‌లోని కస్తూరిబా బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో చదివిన విద్యార్థిని ఈ విద్యా సంవత్సరంలో ఇక్కడ చేరింది. హాస్టల్‌లో ఉండటం తనకు ఇష్టం లేదని, అందుకే చనిపోవాలనుకుంటున్నట్లు లేఖలో పేర్కొంది. విషయం తెలిసిన వెంటనే విద్యార్థిని తల్లిదండ్రులు ఎర్రబోయిన నరేశ్, నాగజ్యోతి దంపతులు ఆసుపత్రికి వచ్చి విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. సీసీసీ ఓమాక్స్ కాలనీ వద్ద ఉంటున్న వారు సోమవారం ఉదయమే కూతుర్ని తీసుకొని వచ్చి హాస్టల్‌లో చేర్పించిన కొద్ది సేపటికే ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టడం తల్లిదండ్రులను కలిచివేసింది.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మల్లేశ్ (ఫైల్)

తిర్యాణి: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన అక్కిపల్లి మల్లేశ్ (45) మానసిక స్థితి బాగోలేక మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే సోమవారం శంకర్ అనే వ్యక్తికి చెందిన చేనులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒంటరితనం భరించలేక యువకుడు..


శ్రీనివాస్ (ఫైల్)

లోకేశ్వరం: ఒంటరితనం భరించలేక గోదావరిలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన మాడబోయి శ్రీనివాస్(27) తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతి చెందడంతో సోదరి కవితతో కలిసి పెద్దమ్మ పోసాని వద్ద ఉంటున్నారు. మూడేళ్ల క్రితం దుబాయ్ వెళ్లిన శ్రీనివాస్ నాలుగు నెలల క్రితం ఇంటికి తిరిగి వచ్చాడు. పెళ్లి చేసుకుంటానని రూ.2.50 లక్షలు ఖర్చుచేసి ఇంటికి మరమ్మతులు చేయించాడు. సంబంధాలు కుదరకపోవడంతో ఒంటరిగానే ఉంటున్నాడు. ఆదివారం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా సోమవారం పంచగుడి వంతెన వద్ద శవమై కనిపించాడు. మృతుని పెద్దమ్మ పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

భైంసారూరల్: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెండ్‌పెల్లి గ్రామానికి చెందిన తోకల గంగాధర్ (29) కూలీ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానియ్యాడు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య, కుమార్తె ఉన్నారు.

ఉద్యోగం రాలేదని ఒకరు..

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని న్యూకాలనీకి చెందిన పెరుగ నిఖిల్ సాత్విక్ (30) బీటెక్ పూర్తిచేసి ఇంట్లోనే ఉంటున్నాడు. ఉన్నత చదువులు చదివినప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

సోన్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని సంఘంపేటలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఆర్‌ఐ అల్మున్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గొర్రె శ్రీకాంత్ పెంకుటింట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్పందించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఇంట్లోని బీరువా, బట్టలు, రూ.లక్ష నగదు, బంగారం, సామగ్రి దగ్ధమైనట్లు తెలిపారు. సుమారు రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు శ్రీకాంత్ కోరుతున్నారు.

17 నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణ శివారులోని కొండాపూర్‌లో గల నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల 17 నుంచి 20 వరకు రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు స్టార్ మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ముఖేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు. సోమవారం నిర్మల్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అండర్–19 బాలురు, బాలికలకు సింగిల్స్, డబుల్, మిక్స్ డబుల్ విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. 17న క్వాలిఫైయింగ్ పోటీలు, 18 నుంచి 20 వరకు మెయిన్ డ్రా పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కిషోర్, కో కన్వీనర్ వన్నెల భూమన్న, కోఆర్డినేటర్లు సందీప్, మధుకర్ గౌడ్, మహేష్, ప్రణీత్, నందకుమార్, పేట సంఘం జిల్లా అధ్యక్షుడు భుక్య రమేశ్ పాల్గొన్నారు.

వాగు దాటి వైద్యం అందించి..


కెరమెరి: వాగుదాటి వెళ్తున్న వైద్య సిబ్బంది

కెరమెరి: కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది సోమవారం మండలంలోని లక్మాపూర్ వాగు దాటి గ్రామానికి వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు అందించారు. అనుమానితుల వద్ద నుంచి రక్తపూతలు సేకరించారు. వానాకాలం వచ్చిందంటే అటు ప్రజలకు, ఇటు అధికారులకు ప్రయాణ తిప్పలు తప్పడం లేదు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మెస్రం సోము, హెచ్‌ఏలు వసంత్, శంకర్, ఏఎన్‌ఎం సుమలత, ఆశా వర్కర్ తారా, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలోని పిట్టబొంగురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్ వైజర్ రాథోడ్ జలేందర్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చిత్తాబట్టలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామానికి వెళ్లే మార్గంలో వాగు ఉండడంతో నీటి ప్రవాహంలో వాగును దాటి గ్రామానికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ గంగమ్మ, ఏఎన్‌ఎంలు సంతోషిని, దేవిక, సునీత, తదితరులు పాల్గొన్నారు

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన మూగ నగేష్ సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తర్వాత బంధువులకు ఫోన్ చేసి తాను ఇంటికి రానని చెప్పాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. అతని బంధువు కమలశోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

తానూరులో వివాహిత..

తానూరు: మండల కేంద్రానికి చెందిన కటకం సోనీ (24)అదృశ్యమైనట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు.. తానూరుకు చెందిన సోనీకి ఆరేళ్ల క్రితం మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన పవన్‌తో వివాహమైంది. ఇద్దరి మధ్య గొడవల కారణంగా సోనీ తన తల్లిగారి ఊరైన తానూరులో ఉంటుంది. ఈనెల 11న పవన్ తానూరుకు వచ్చి పెద్ద కుమారుడిని తీసుకుని నాందేడ్ వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి సోనీ చిన్న కుమారుడుని తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాధితురాలి తండ్రి గంగాధర్ సోమవారం తానూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: నిజామాబాద్ జిల్లా జనకంపేటకు చెందిన ఎడ్ల వ్యాపారి మహ్మద్ సలీమ్ ఖురేషిని బెదిరించి రూ.20వేలు డబ్బులు వసూలు చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఘడియాల్ మొహల్లాకు చెందిన సంటెన్న, ఖుర్షీద్‌నగర్‌కు చెందిన మజర్‌లు వ్యాపారిని బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. బాధితుడు టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా సంటెన్నను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మజర్ పరారీలో ఉన్నట్లు వివరించారు.

దాడి కేసులో ఒకరికి జైలు

ఆదిలాబాద్‌టౌన్: కులం పేరుతో దూషించి గొడ్డలితో దాడి చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక జడ్జి కుమార్ వివేక్ తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. 2022 జనవరి 31న జైనథ్ మండలంలోని గూడ గ్రామానికి చెందిన బాధితుడు మడావి రాజు తన భార్యతో కలిసి పిట్టగూడకు వెళ్లివస్తుండగా బండారి దేవన్న దారికి అడ్డుగా వచ్చి మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని అడిగాడు. తనవద్ద లేవని చెప్పడంతో గొడవపడి గొడ్డలితో దాడి చేశాడు. గాయాలు కావడంతో బాధితుడు జైనథ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై బిట్లపెర్సిస్ కేసు నమోదు చేశారు. పీపీ రమణారెడ్డి 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చినట్లు వివరించారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు


నిందితుల చూపిస్తున్న అటవీశాఖ సిబ్బంది

రెబ్బెన: వన్యప్రాణులను వేటాడినా హాని కలిగించినా వన్య ప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జి రెబ్బెన ఫారెస్టు రేంజ్ అధికారి భానేష్ అన్నారు. ఈనెల 9న అడవి పందిని హతమార్చిన కేసులో నిందుతులను సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెబ్బెన మండలంలోని గోలేటికి చెందిన కుమురం భీంరావు, కన్నెపల్లి వెంకటేష్ అడవిపందిని వేటాడి హతమార్చినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుండి అడవి పంది మాంసం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్వో చంద్రమోహన్, గోలేటి ఎఫ్‌బీవో వెంకటేష్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో రెండేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్: గంజాయి సాగు చేసిన కేసులో లింగాపూర్ మండలంలోని రావునూరుకు చెందిన కోట్నాక సోముకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవి. రమేశ్ సోమవారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పీపీ జగన్‌మోహన్ రావ్, ప్రస్తుత ఆసిఫాబాద్ సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్, జైనూర్ సీఐ రమేశ్, లింగాపూర్ ఎస్సై గంగన్న, ఆసిఫాబాద్ డివిజన్ కోర్టు లైజనింగ్ అధికారి రాంసింగ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.